క్లుప్తంగా

ఆలయంలో మువ్వా పూజలు


మువ్వా దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్‌లో ఇటీవల పునఃప్రతిష్ఠ నిర్వహించిన శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయబాబు, శ్రీవల్లి దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మువ్వా దంపతులను నిర్వాహకులు సన్మానించారు. గుంజా వెంకటేశ్వరరావు, మిద్దే రామకృష్ణ, బాబి, నాగరాజు, కోటేశ్వరరావు, శైలజ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పంటకాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. పనిప్రదేశాల్లో ఉపాధిహామీ కూలీలకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు.

38 కోర్సుల్లో శిక్షణ

సత్తుపల్లిరూరల్: సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యాన సత్తుపల్లి గనుల ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్‌లో భాగంగా 38 కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు కిష్టారం ఓసీ పీఓ వి.నర్సింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

తల్లాడ: తల్లాడ మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఆటంకాల పట్ల గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీల్లో ముమ్మరంగా పనులు నడుస్తున్నాయని, పనులు ప్రదేశంలో టెంట్లు వేసి నీడ కల్పించాలనీ, అలాగే మంచి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఎంపీఓ కె.శ్రీదేవి, ఏపీఓ కోటయ్య, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అన్నదానం

మధిరరూరల్: మండలంలోని ఆత్కూరు శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. మండవ కిషోర్, వెంకటలక్ష్మి సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు హనుమంతరావు, కృష్ణ ప్రారంభించారు.

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివిలి సుజాత కుటుంబ సభ్యులు రూ.13,120 అందించగా అన్నదానం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య, మాధురి మధు, ఆదిశేషు, కోట మోహన్‌రావు, శుభాకర్, సాయిరమ్య, పవన్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కల్లూరు: మండలకేంద్రంలోని చంద్రుపట్ల క్రాస్ రోడ్ వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఏకే ఫ్యాషన్స్ యజమాని బండి కృష్ణ జన్మదినాన్ని సందర్భంగా మజ్జిగ, తాగునీటి పంపిణీ చేశారు. నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, కట్టా గోపాలరావు, దారా రంగా, బైర్ల కాంతారావు, ఎస్‌కే ఉస్మాన్, ఎనుముల రాము, నల్లగట్ల ప్రసాద్, గుమ్మడిదల ప్రవీణ్, బొడ్డు తిరుపతిరావు గౌడ్, కంభంపాటి పుల్లాచారి, దేవరపల్లి వెంకటేశ్వరరావు, బాల నాగేశ్వరరావు, ఎండీ.షఫి పాల్గొన్నారు.

'మాట తప్పిన కాంగ్రెస్'


శ్రీనివాసరావు

సత్తుపల్లి: వందరోజుల్లో రైతు రుణమాఫీ, వరికి రూ.500 బోనస్ అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాటతప్పిందని, అన్నివర్గాల ప్రజలను వంచించి అధికారంలోకి కాంగ్రెస్ వచ్చిందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి అత్యధిక మెజార్టీ తీసుకొచ్చి నామా నాగేశ్వరరావు విజయానికి కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు.

బైక్ చోరీపై కేసు

పెనుబల్లి : ద్విచక్రవాహనం చోరీపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లికి చెందిన పుసులూరి హనుమంతరావు గత నెల 17న వీయంబంజర్‌లోని ఓ షాపు బయట రోడ్డుపై బైక్ నిలిపి షాపులోకి వెళ్లి వచ్చేసరికి తన హోండా షైన్ బైక్ చోరీకి గురైంది. తనకు తెలిసిన చోట్ల ఇప్పటి వరకు గాలించి ఆచూకి లభించకపోవడంతో చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కంకరపైనే ప్రయాణం..!

ఏళ్ల తరబడి నిలిచిన మెకాలకుంట-జంపాలనగర్ బీటీ రోడ్డు

- సీసీ రోడ్డు పోసి డ్రెయినేజీలు వదిలేసిన వైనం
- ఇబ్బంది పడుతున్న గిరిజనులు


కంకర తేలిన మెకాలకుంట జంపాలనగర్ రోడ్డు

కొణిజర్ల: గిరిజన గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు చేస్తున్నామని పాలకులు చెప్పడంతో పొంగిపోయారు. అన్నట్టుగానే రోడ్డు మంజూరయ్యింది. పనులు మొదలు పెట్టారు. తర్వాత సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపి వేసి అడ్రస్ లేకుండాపోయాడు. ఇది జరిగి ఆరేళ్లు అవుతున్నా పట్టించుకున్న వారు లేరు. దీంతో గిరిజన గ్రామాల ప్రజలు కంకరపైనే ప్రయాణం చేస్తూ నానా అవస్థలు పడుతున్నారు. ..

అడ్డుకున్న అటవీ అధికారులు..

కొణిజర్ల మండలం మెకాలకుంట నుంచి జంపాలనగర్ వరకు ఐటీడీఏ నిధులు రూ 3.20 కోట్లతో 2018లో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌లు 2018 డిసెంబర్ 24న శంకుస్థాపన చేశారు. మెకాలకుంట గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీలు, అక్కడి నుంచి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే సదరు కాంట్రాక్టర్ మెకాలకుంటలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి, కాల్వలు తవ్వి కొద్ది మేరా డ్రెయినేజీలు వేశాడు. మెకాల కుంట నుంచి జంపాలనగర్ వరకు రోడ్డు గ్రావెల్ వేశారు. ఈలోగా జంపాలనగర్ ప్రాంతం పూర్తి అటవీ ప్రాంతమని రోడ్డు వేయడానికి అనుమతి లేదంటూ అటవీ శాఖాధికారులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రెండేళ్ల పాటు పనులు నిలిపి వేశారు.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్..

అధికారులు, ప్రజాప్రతినిధులు అటవీ అధికారులతో సంప్రదింపులు జరిపి ఎట్టకేలకు రోడ్డు వేయడానికి అనుమతి తీసుకున్నారు. అనంతరం ఏడాది క్రితం సదరు కాంట్రాక్టర్ తిరిగి పనులు మొదలు పెట్టారు. మొదటి లేయర్‌గా చిప్స్ వేసి వదిలేశాడు. ఆ తర్వాత చేతులెత్తేశాడు. తనకు బిల్లులు కాలేదని, తనకు రోడ్డు నిర్మాణ వ్యయం పెరిగిందని రోడ్డు పనులు చేయలేక పోతున్నానని చెబుతున్నాడు. దీంతో రెండున్నర ఏళ్లుగా కంకర తేలిన రోడ్డు మీదనే రెండు గ్రామాల ప్రజలు తిరుగుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ద్విచక్రవాహనదారులు జారి కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

డ్రెయినేజీల నిర్మాణం అంతే..


అసంపూర్తిగా వదిలేసిన డ్రెయినేజీ

డ్రెయినేజీలు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నామని మెకాలకుంట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం గతేడాది తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు భారీ పాదయాత్ర నిర్వహించి రాస్తారోకోలు సైతం నిర్వహించారు. అధికారులు సదరు కాంట్రాక్టర్‌తో పని చేయిస్తామని లేని పక్షంలో కాంట్రాక్ట్ రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. ఇటీవల గ్రామస్తులు ప్రస్తుత ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్‌ను కలిసి సమస్య వివరించగా ఆయన అధికారులను ఆరా తీయగా సదరు పనులు రద్దుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కొత్తగా టెండర్లు పిలిచి అయినా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రోడ్డు మీద పోవాలంటే కంకర తేలి ఉంది నడవడానికి ఇబ్బందిగా ఉంది. ఆడవాళ్లు చిన్న పిల్లలు ఈ రోడ్డు మీద నడవాలంటే ఇబ్బంది పడుతున్నారు. డబ్బులు లేకపోతే పని చేయకుండా వేరే వాళ్లకు ఇవ్వాలి అంతేకాని ఇలా పని మధ్యలో వదిలేసి ఇబ్బందులకు గురి చేయకూడదు. ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోవడం లేదు.

– గుగులోత్ మాన్‌సింగ్, మెకాలకుంట

మా గోడు ఎవరికీ పట్టడం లేదు..



మా గిరిజనుల బాధలు, గోడు ఎవరికీ పట్టడం లేదు. జంపాలనగర్ రావాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాం, ముఖ్యంగా వానా కాలం గ్రామానికి ఒక్క వాహనం కూడా రాదు. ఎక్కడికి పోవాలన్నా నడిచే పోవాల్సి వస్తుంది. కంకర తేలిన రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే యాతన పడుతున్నాం.

– బానోత్ సరోజ, జంపాలనగర్

రోడ్డు నిర్మాణం చేపట్టాలి..



మెకాలకుంట జంపాలనగర్ గ్రామానికి రోడ్డు వేస్తే మెకాలకుంట, జంపాలనగర్ గ్రామాలకు సౌకర్యవంతంగా ఉంటుంది. వానాకాలంలోవాగుల దగ్గర ఎక్కడ జారి పడిపోతామోనని భయపడిపోతున్నాం. అధికారులు స్పందించి కొత్తగా టెండర్లు అయినా వేయించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాంచాలి. – మాలోత్ రామ్మూర్తి, జంపాలనగర్

ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మధిర: ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, కల్యాణ మండపం నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రింటింగ్ వేసిన కరపత్రాలు, పోస్టర్లపై తప్పనిసరిగా ప్రతుల సంఖ్య, ప్రింటింగ్ ప్రెస్ పేరు, సెల్ నంబరు, ప్రచురణకర్తల పేర్లు ఉండాలన్నారు. ప్రింటింగ్ వేసిన అనంతరం వాటిని తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. కల్యాణ మండపాల్లో అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించడం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. మే 13 వరకు ఎవరైనా కల్యాణ మండపాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయ వార్షికోత్సవం

తల్లాడ: మండలంలోని కేశ్వాపురం గ్రామంలో మంగళవారం సీతారామాంజనేయ ఆలయం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హోమగుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ వనిగండ్ల అలేఖ్య, ఆలయ కమిటీ చైర్మన్ కట్టా రమాకాంత్, అశోక్, పిచ్చయ్య, కృష్ణకుమారి, తరుమాలరావు, కోటేశ్వర్‌రవు, పద్మావతి, శోభారాణి, రమేష్, విష్ణువర్ధన్, కల్పన, రమేష్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, సభ్యులు వెచ్చా మంగపతిరావు, మాగం వెంకటేశ్వర్లు, యల్లంపల్లి అప్పారావు, కంభం సునిత, గురిజాల జయకుమార్, వీరబాబు పాల్గొన్నారు.

ముగిసిన బ్యూటీషియన్ కోర్సు


శిక్షణ పొందిన విద్యార్థినులతో అధికారులు

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలరోజుల నుంచి కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించారు. సీడీపీఓ ఎ.కొండమ్మమాట్లాడుతూ.. ఈ కోర్సుతో ఆర్థికపరమైన స్వయం ఉపాధిని పొందవచ్చన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ సుజాత, ట్రెనర్ రెహ్మాన్‌బీ, కన్వీనర్ సుభాషిణి, విజయలక్ష్మి, వీరన్న, రామచంద్రరావు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మధిర: మధిర పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ఉన్న ఒక అపార్ట్ మెంట్‌లో మంగళవారం అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణ, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి ప్రదర్శన చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రాంబాబు, నాగేశ్వరరావు, రామిరెడ్డి, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మిక సంఘం ఎన్నిక


కార్యవర్గాన్ని అభినందిస్తున్న సీతారాములు

కొణిజర్ల: ఐఎన్‌టీయూసీ అనుబంధ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ కార్మిక సంఘం జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సూపర్‌జెమ్స్ పాఠశాలలో సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం ఖమ్మం పట్టణాధ్యక్షుడు నరాల నరేష్ మోహన్ నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కొత్తా సీతారాములు, అధ్యక్షుడిగా వేల్పుల అనంతరాములు, ఉపాధ్యక్షుడిగా జంగం నరసింహారావు, వీరాస్వామి, ప్రధాన కార్యదర్శిగా అనుబోతుల బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా గొడ్ల నరసింహారావు, బొల్లుసోమయ్య, కోవూరి నాగేశ్వరరావుతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, గంజి సూర్యనారాయణ, బాషా, సతీష్, లగడపాటి జోగారావు, తాళ్లూరి నవీన్, చిత్తారు రాజబాబు, శ్రీను పాల్గొన్నారు

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

చింతకాని: భార్యపై రోకలిబండతో దాడి చేసిన ముత్యారావును మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. మండలంలోని బస్వాపురంలో శనివారం తెల్లవారుజామున రసపుత్ర లలితపై ఆమె భర్త రోకలిబండతో దాడి చేసి పరారయ్యాడు. దీంతో గాలిస్తుండగా గ్రామ సమీపాన గుర్తించి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

వితరణ..



కారేపల్లి: టీ షర్టులతో విద్యార్థులు

కారేపల్లి: కారేపల్లి బీసీ కాలనీ అంగన్వాడీ కేంద్రానికి కారేపల్లి మాజీ వార్డు సభ్యులు గౌసుద్దీన్ పది కుర్చీలను మంగళవారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టంటం వెంకన్న, ఖలీలుల్లా ఖాన్, అంగన్వాడీ టీచర్ రఘుపతి, ఆయా శోభారాణి, దానబోయిన సమ్మయ్య, షేక్ సద్దాం, బూది, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టులు..

కారేపల్లి మండల పరిధిలోని పోలంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కారేపల్లికి చెందిన బాణోతు చిన్నకోటి-మంగమ్మ దంపతుల కుమారుడు, ఎన్ఆర్ఐ వంశీకృష్ణ-దివ్యశ్రీల చిన్నారి కుమార్తె మౌక్తిక నైరా పుట్టిన రోజు సందర్భంగా టీషర్టులను వితరణగా అందజేశారు. అంతకుముందు మౌక్తికనైరా పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు రమేష్, అజ్మీర వీరూనాయక్, కామల్ల సుందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆదిలక్ష్మి, అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి ఉన్నారు.

నిత్యావసర సరుకులు..


సత్తుపల్లిరూరల్: సరుకులు అందజేస్తున్న సుధారాణి

సత్తుపల్లిరూరల్: ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న సత్తుపల్లి పట్టణానికి చెందిన దిన చెందిన షేక లాల్ మియా కుటుంబానికి సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనుకళ్ల సుధారాని నిత్యావసర సరుకులు అందించారు.

రైతులు ముందుకు రావటం అభినందనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి


సత్తుపల్లి: గోశాలకు తరలిస్తున్న గడ్డి ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: ఖమ్మం గోశాలకు వరిగడ్డి ఇవ్వటానికి రైతులు ముందుకు రావటం అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు ఖమ్మం గోశాలకు సత్తుపల్లి ప్రాంతం నుంచి 40 ట్రాక్టర్ల వరిగడ్డిని అందించామన్నారు. ఇంకా ఎక్కడైనా గోశాలలకు వరిగడ్డి అవసరమైతే రైతుల సహకారంతో అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, చలసాని సాంబశివరావు, ఎండి.కమల్‌పాషా, గాదె చెన్నారావు, వినుకొండ కృష్ణ, కొప్పుల నరేందర్‌రెడ్డి, దొడ్డాకుల గోపాలరావు, రామ్మోహన్‌రెడ్డి, ఇమ్మనేని ప్రసాద్, టోపి శ్రీను పాల్గొన్నారు.

టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సత్తుపల్లిరూరల్: టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి అన్నారు. నూతనంగా ఎన్నికైన టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన ఎమ్మెల్యే రాగమయిని కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఉమామహేశ్వరరావును శాలువాతో సత్కరించారు. కమిటీ మండలాధ్యక్షుడు అల్లాడి రాము, మదీన, శ్రీనివాసరావు, వేణి, లలిత, సుభాని, వెంకటాచారి, శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

మరోమారు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వండి

- ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు


మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు

ఎర్రుపాలెం: ఖమ్మం ఎంపీగా మరోమారు తనకు అవకాశం ఇవ్వాలని.. తద్వారా తెలంగాణ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించడమే కాక జిల్లా సమగ్రాభివృద్ధి పాటుపడతానని బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తెలిపారు. ఎర్రుపాలెం మండలం జమలాపురంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనే విషయాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ద్వారా బీఆర్‌ఎస్ విజయానికి పాటుపడాలని సూచించారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరావు, సండ్ర వెంకటవీరయ్య మాట్లాడగా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు, జెడ్పీటీసీ శీలం కవిత, నాయకులు చావా రామకృష్ణ, తాళ్లూరి జీవన్, ముల్పూరి శ్రీనివాసరావు, మదన్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, యన్నం శ్రీనివాసరెడ్డి, సూరానేని రామకోటేశ్వరరావు, దేవరకొండ రవి, కొండెపాటి సాంబశివరావు, చెన్నం రాజు పురుషోత్తంరాజు, కాలసాని వెంకటనారాయణ, యరమల భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి వినోదరావు


కల్లూరు రూరల్ : పడమర లోకవరంలో బీజేపీ నాయకులతో అభ్యర్థి వినోదరావు

కల్లూరురూరల్/తల్లాడ/పెనుబల్లి/వేంసూరు: కేంద్రంలోని నరేంద్రమోదీ సారధ్యాన కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోదరావు వెలడించారు. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోమారు సైతం కేంద్రంలో అత్యధిక సీట్లతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఇందులో భాగంగా ఖమ్మం నుంచి తనను గెలిపిస్తే జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. హిందువుల 500ఏళ్ల కల అయిన అయోధ్య రామ మందిరాన్ని సాకారం చేసిన నరేంద్ర మోదీకీ అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఈప్రచారంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఖమ్మం లోక్‌సభ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర్‌రావుతో పాటు నాయకులు పసుపులేటి సుబ్బారావు, వాసిన కిషోర్, బుర్రి వెంకటరామారావు, గుమ్మ రామకృష్ణ, తుమ్మలపూడి పెద్ద పుల్లారావు, గుండెపునేని అనిల్, ఆమన గంటి కృష్ణమోహన్, వీరంరాజు, శ్యాంరాథోడ్, ఆపతి వెంకటరామారావు, సుదర్శన్ మిశ్రా, పగిడాల మధు, చావా కిరణ్, నాయుడు రాఘవరావు, మున్నా మిశ్రా, బొర్రా నరసింహారావు, పడిగల మధుసూధన్‌రావు, చావా కిరణ్, పర్సా రాంబాబు, పగిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. మద్దినేని వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అనగాని రామారావు, యువమోర్చా మండలాధ్యక్షుడు కొండా గోపీ, నాగేశ్వరరావు, పిచ్చారావు పాల్గొన్నారు.

కార్పొరేట్లు అభివృద్ధి చెందేలా మేనిఫెస్టో


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరారూరల్: ప్రధాని నరేంద్ర మోదీ గ్యారంటీ పేరుతో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఎన్నికల మెనిఫెస్టో కార్పొరేట్ సంస్థలను మరింత అభివృద్ధి చేసేలా ఉండి రైతులు ఆత్మహత్యల వైపు నెట్టేసే విధంగా ఉన్నాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. గొల్లెనపాడు గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాసరావు, వెంపటి రాజా, వెంకటనారాయణ, నల్లమోతు రాజాబాబు, ధర్మారావు, పద్మా, నాగమణి పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

పెనుబల్లి : ఉపాధిహామీ కూలీలకు వేసవి కాలంలో మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని తాళ్లపెంటలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు చిరంజీవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఆలయాలు ముస్తాబు

శ్రీరామ నవమి పురస్కరించుకుని బుధవారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈ మేరకు ఆలయాలను అందంగా అలంకరించారు. ప్రాంగణాల్లో చలువ పందిళ్లు వేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిటౌన్: ముస్తాబైన కోదండ రామాలయం


ముదిగొండ: ముత్తారంలోని శ్రీ సీతారాముల వారి దేవస్థానం..


ఏన్కూరు: పందిరి వేయిస్తున్న కమిటీ సభ్యులు


తల్లాడ: పినపాక గ్రామంలో కోదండ రామాలయంలో చలువ పందిరి


వైరారూరల్: గొల్లపూడిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం